తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల | ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం అసిఫాబాద్ | మహబూబాబాద్

మంగళవారం 11 నవంబర్ 2025

పేజీలు : 08



## సమస్యల పరిష్కారం కోసం అధికారులు చురుకుగా వ్యవహరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి..

**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 10 (జనంసాక్షి):** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిడబ్ల్యూ ఓ రాజమణి, లతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల ప్రజలు నుండి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖాధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి, పరిధిలో పరిష్కరించగలిగిన వాటిని వెంటనే పరిష్కరించాలని, పరిధికి సంబంధించినవి కాని అంశాలపై దరఖాస్తుదారులకు లిఖితపూర్వకంగా తెలుపుతూ సరైన సూచనలు అందించాలని తెలిపారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 165 దరఖాస్తులు స్వీకరించగా, అందులో భూ సమస్యలు 45, గృహ నిర్మాణ శాఖకు 15, కలెక్టరేట్ 15, జిడబ్ల్యూ ఎంసీ 8, పోలీసు శాఖ 6 ఇతర శాఖలకు సంబంధించినవి 76 దరఖాస్తులను సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల మిగతా 7లో..

## ఆదమరిస్తే అంతే సంగతులు

- గుట్ట రోడ్డు మార్గంలోని మూలమలుపుల వద్ద దారి కన్పించకుండా చెట్లు
- భక్తుల వాహనాలు ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తుల విన్నపాలు...




**మంగపేట నవంబర్ 10 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో రెండవ యాదగిరిగుట్టగా సుప్రసిద్ధి చెందిన స్వయంభువుక్షేత్రం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయం. ఈ ఆలయానికి నిత్యం భక్తులు వేలాది సంఖ్యలో తమ తమ వాహనాలతో రాకపోకలు సాగిస్తూ ఉంటారు. కానీ ఈ గుట్ట మార్గం ద్వారా ప్రయాణం కొనసాగిస్తున్న సమయంలో ఆదమరిస్తే...అంతే సంగతి అని భక్తులు ఆరోపిస్తున్నారు. మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రతి శని, ఆదివారాలల్లో స్వామివారికి తిల తైలాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. కానీ ఆ సమయాల్లో భక్తులు వేలాది సంఖ్యలో హేమాచల క్షేత్రానికి తరలివస్తారు. ఈ గుట్ట ద్వారా స్వామివారి సన్నిధికి చేరాలంటే కొన్ని ప్రమాదకరమైన మూలమలుపుల వాహనాల రాకపోకలు కనిపించకుండా భారీ ఎత్తున చెట్లు పెరగడంతో తిప్పలు తప్పడం లేదు. మల్లూరు గ్రామంలోని ఏటూరునాగారం – బూర్గంపహాడ్ జాతీయ రహదారి నుండి శ్రీ హేమాచల నరసింహస్వామి క్షేత్రానికి చేరాలంటే సుమారు ఈ గుట్ట మార్గం ద్వారా మూడు కిలోమీటర్ల మేర రోడ్డు ప్రయాణం కొనసాగించాలి. కానీ ఈ రోడ్డు మార్గంలో అనేక మూలమలుపులు ఉండడంతో భక్తులు ప్రయాణించే వాహనాలు ఏ మూలమలుపుల వద్ద ప్రమాదం పొంచి వస్తుందని భయం గుప్పిట్లోనే ప్రయాణాన్ని కొనసాగిస్తున్నామని భక్తులు తమ ఆవేదనలను వ్యక్తపరిచారు. గతంలో ఈ మూలమలుపుల వద్ద భక్తుల వాహనాలు ప్రమాదాలకు గురైన సందర్భాలు చాలా ఉన్నాయి. కానీ ఈ విషయంపై నేటి వరకు కూడా అధికారులు పట్టించుకోకపోవడం హేయమైన చర్య అని భక్తులు వాపోయారు. నాటి నుండి నేటి వరకు కూడా ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు అలానే ఉన్నాయి. ప్రమాదాలకు మూలకారణం మూలమలుపుల వద్ద భారీ ఎత్తున చెట్లు పెరగడంమే ప్రధాన సమస్యగా మారి భక్తుల వాహనాల రాకపోకలు అంతరాయం కలుగుతుందని అలాగే భక్తులు ప్రమాదాలకు గురికావడం జరుగుతుందని భక్తులు వాపోయారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు, ఎండోమెంట్ అధికారులు దృష్టి సారించి భక్తులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా మూలమలుపుల వద్ద చెట్లను తొలగించి భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కలిగించే విధంగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

## దుబ్బతండ అంగన్వాడీ కేంద్రం తెరిచేదెప్పుడో!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు...
- ఐసిడిఎస్ అధికారుల పర్యవేక్షణ కరువు...



చెన్నారావుపేట, నవంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని పత్తి నాయక్ తండ గ్రామ శివారులో ఉన్న దుబ్బ తండాలోని అంగన్వాడి కేంద్రం తెరుచుకోకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తండాలోని గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం కోసం అంగన్వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ అంగన్వాడి కేంద్రంలో టీచర్ గా భారతి పనిచేస్తుంది. ఆయా పోస్టు గత కొద్ది సంవత్సరాలుగా ఖాళీగా ఉంది. అంగన్వాడి కేంద్రాన్ని ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు తెరిచి తండాలోని గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులకు విధిగా పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంది. సోమవారం కూడా అంగన్వాడి కేంద్రం తెరుచుకోకుండా తాళం వేసి ఉంది. అంగన్వాడీ టీచర్ భారతి కాజీపేటలో నివాసం ఉంటూ అంగన్వాడి కేంద్రాన్ని సక్రమంగా తెరవడం లేదని తండాలోని గిరిజనులు బాహటంగా ఆరోపిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి అలా వచ్చి అంగన్వాడి కేంద్రాన్ని తెరిచి పౌష్టికాహారాన్ని పంపిణీ చేసి వెళ్తుందని ప్రతిరోజు విధులకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న ఐసిడిఎస్ అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందని అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విధులకు సక్రమంగా రాకుండా అంగన్వాడి కేంద్రాన్ని తెరవకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అంగన్వాడీ టీచర్ భారతి పై శాఖ పరమైన చర్యలు తీసుకొని అంగన్వాడి కేంద్రాన్ని ప్రతిరోజు తెరిచేవిధంగా చూసి పౌష్టికాహారాన్ని విధిగా అందించే విధంగా చూడాలని గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు, తండాలోని గిరిజనులు కోరుతున్నారు.

## ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం భూపాలపల్లి ఐడిఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కార నిమిత్తం ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 41 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సమస్యలను విని వెంటనే పరిష్కారం చూపించడం లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 41 మంది దరఖాస్తుదారులతో కలెక్టర్, మీ సమస్య చెప్పండని అడిగి తెలుసుకుని దరఖాస్తు పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను సమయానికి పరిష్కరించడం అన్ని శాఖల బాధ్యత అని తెలిపారు. ప్రతి ఫిర్యాదును జాగ్రత్తగా నమోదు చేసి, పరిష్కారం వరకు అధికారులు పర్యవేక్షించాలని, అవసరమైతే ఫీల్డ్ పరిశీలనలు కూడా చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అందెశ్రీ గారికి గీతాంజలి విద్యాసంస్థ అశ్రునివాళి



నర్సంపేట నవంబర్ 10 (జనం సాక్షి)కదిలే కవిగానం మూగబోయింది.అక్షరాలు నిప్పు కనికలై,వెన్నెల్లో చిన్నపిల్లలై,ఆడే రథం ఆగిపోయింది.కనులు కన్నీళ్లు కార్చగా, అక్షరం ఆర్తనాదం చేస్తుండగా, కవి గలం మూగబోయింది. కలం ఆగిపోయింది. తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత, ప్రముఖ కవి, రచయిత, సినీగేయ రచయిత అయిన అందెశ్రీ . మరణించడం చాలా బాధాకరమని ఆయన సేవలు తెలంగాణ ప్రజలు మరువలేనివని గీతాంజలి ప్రిన్సిపాల్ ఎన్.రాజేష్ . తెలియజేశారు.అనంతరం గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో అందెశ్రీ గారు రచించిన జయ జయహే తెలంగాణ గేయం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుని ప్రజలు ఉద్యమంలో పాల్గొని రాష్ట్రాన్ని సాధించడంలో మనకు ఊపిరి అయిందన్నారు.అనంతరం ఉపాధ్యాయిని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మాట్లాడుతూ నడిచే నవతరం ప్రజల హృదయాతరంగాలు ఎరిగిన ఒక గొప్ప కవి మరణించడం ఎంతో బాధాకరమని ఆయన ఆత్మ శాంతికై అందరూ ఒక నిమిషం పాటు మౌనం పాటించి కన్నీటి వీడ్కోలు పలికారు.తర్వాత అందెశ్రీ చిత్రపటానికి మాల వేసి నివాళులు అర్పించారు.

## వృత్యంతర శిక్షణతో ఉద్యోగావకాశాలు: డీఐఈఓ ఆన్ జాబ్ శిక్షణా కేంద్రాల తనిఖీ



నర్సంపేట నవంబర్ 10 (జనం సాక్షి) ఇంటర్మీడియట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో నిర్వహించబడే ఆన్ జాబ్ ట్రైనింగ్(ఓజేటీ) ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని జిలా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. సోమవారం నాడు వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి, నర్సంపేట మండలాల్లోని ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థుల ఆన్ జాబ్ ట్రైనింగ్ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు, వారి రోజువారీ నేర్చుకునే రికార్డు లను పరిశీలించారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ఒకేషనల్ విద్యార్థులు రెండు నెలల పాటు తప్పనిసరిగా వృత్యంతర శిక్షణ పొందాలని, వారి అనుభవాలను, రికార్డులను పరిశీ లించి 100 మార్కులు కేటాయిస్తున్నారని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసు కొని భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలను సొంతం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఒకేషనల్ కళాశాలలు తమ విద్యార్థులను వృత్తి విద్యలో రాణించేలా కృషి చేయాలని, వారికి తగు మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. డీఐఈఓ పర్యటనలో కళా శాల ప్రిన్సిపాళ్లు మనోహర్, సరిత. కార్యాలయ సిబ్బంది కొలంబో తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను అభినందించిన వాసవి గవర్నర్




బెల్లంపల్లి, నవంబర్ 10, (జనంసాక్షి)వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ లో నిర్వహించిన అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ లో జిల్లా 107ఏను అంతర్జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలబెట్టిన క్రీడాకారులను, కన్యకా జట్టును వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ ఇల్లందుల కిషోర్ అభినందించారు. సోమవారం మంథనిలో జిల్లా 8వ వార్షిక సదస్సులో క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు సిల్వర్ కప్పులను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో వాసవి నాయకులు, ఆర్యవైశ్య నాయకులు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాలో 204 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం

### వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ




జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జిల్లాలో 204 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం చేశామని వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి ధాన్యం, మొక్కజొన్న, సోయా, పత్తి కొనుగోళ్లపై అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార, మార్కెట్, రవాణా శాఖలు, పౌర సరఫరాల సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కార్యదర్శి స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొనగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 204 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పత్తి కొనుగోలుకు 4 సీసీఐ కేంద్రాలు ప్రారంభించగా, మరో కేంద్రం ఏర్పాటు ప్రక్రియలో ఉందని తెలిపారు. మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లో ఇప్పటికే వరి కోతలు జరుగుతున్నాయని, ఈ వారంలో మిగిలిన మండలాల్లో కూడా కోతలు ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాల్య నాయక్, వ్యవసాయ అధికారి బాబురావు, రవాణా శాఖ అధికారి సంధాని తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను బద్నామ్ చేయడానికే దళారుల ప్రయత్నం

### బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు



బెల్లంపల్లి, నవంబర్ 10, (జనంసాక్షి)బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను బద్నామ్ చేయడానికే దళారులు ప్రయత్నం చేస్తున్నారని బెల్లం పల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు అన్నారు. సోమవారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేను బద్నామ్ చేస్తూ కొంతమంది దళారులు పబ్బం గడుపుకుంటున్నారన్నారు. జరుగుతున్న అవినీతిపై ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోనే కాకుండా వివిధ మండలాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లలో అవినీతి చోటు చేసుకోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఉన్న 34 వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ ఇవ్వడంలో అవినీతి జరిగిందన్నారు. అన్ని వార్డులకు సమానంగా ఇవ్వలేదని, కొన్ని వార్డులకు మొత్తానికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వలేదన్నారు. దీనికి ప్రధాన కారణం పెద్దఎత్తున అవినీతి జరిగిందని, నాయకులు దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తిగా పేదవాళ్లకు చెందాలి కానీ దీని మీద కూడా పలు ఆరోపణలు రావడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు 3 లక్షలు రూపాయలు ఇస్తేనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అలాట్మెంట్ చేపిస్తామని చెప్పడం, జిల్లా అధ్యక్ష పదవి కూడా డబ్బులు ఇస్తేనే వస్తుంది అని మాట్లాడడం వల్ల ప్రజల్లో పార్టీ బద్నామ్ అవుతుందని అన్నారు. పార్టీ పేరు చెప్పుకొని పబ్బం గడుపుకుంటున్న వ్యక్తులపై అధిష్ఠానం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలో రోడ్డు వెడల్పు చేయాలని నిర్ణయించడం అభివృద్ధిలో భాగమని, ముందుగానే చిరు వ్యాపారస్తులకు కావలసిన స్థలం చూపాల్సి ఉందని అన్నారు. అలాంటి చర్యలు ఏమి చేయకుండా చిరు వ్యాపారస్తులను రోడ్డున పడేశారని, వారి కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని, ఇప్పటికైనా ఎమ్మెల్యే జోక్యం చేసుకోని చిరు వ్యాపారస్తులకు న్యాయం చేయాలని అన్నారు. పార్టీలో జరుగుతున్న వాస్తవాలను తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు, పేద ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. పది రోజుల్లో ఎమ్మెల్యేపై విషయాలపై వెంటనే స్పందించాలని, లేని యెడల పేద ప్రజల పక్షాన బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గెల్లి జయరాం యాదవ్, సిలువేరి సత్యనారాయణ, మమ్మద్ అఫ్జల్, మేకల శ్రీనివాస్, పోతరాజుల శ్రీనివాస్, మత్తమరి శ్రీనివాస్, అన్వర్ ఖాన్, మంతెన మల్లేష్, మంతెన కొమురయ్య, బిరె మధురయ్య, మహమ్మద్ ఓజీయార్, మహమ్మద్ రషీద్, ఆరేపల్లి రాజయ్య, రవి, లక్ష్మణ్, పోషన్న, జంజిరాల మనోహర్, గంధం రమేష్, బాబురావు, బబ్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ త్రయాహ్నిక ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రిక అధికారులకు అందజేత

సారంగాపూర్,అక్టోబర్ 10(జనం సాక్షి) సారంగాపూర్ మండల కేంద్రంలో గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ మూడు రోజుల 11- 13 తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమానికి హాజరు కావాలని గౌడ సంఘం సభ్యులు సోమవారం తాసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మి కాంతారావు, ఏవో వికర్ అహ్మద్ ఆహ్వాన పత్రిక అందజేశారు.



# ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి :చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఖానాపూర్ నవంబర్ 10 (జనం సాక్షి)**నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక మండలాభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో పథకాల వర్తింపు పారదర్శకంగా ఉంటుందని అన్నారు. నిరుపేద లబ్ధిదారుల దరికి చేర్చే విధంగా పథకాలను అమలుపరుస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో జరిగిన అవతలపై విచారణ చేపట్టినట్లు, నివేదికపై అధికారులు స్పందించి నోటీసులు సైతం జారీ చేశారని అన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఖాళీ ఉన్న వాటిలో లబ్ధిదారులకు అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో రెండు, మూడు విడత లవారీగా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక చేసి వారికి వర్తింప చేస్తామని అన్నారు. కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పొందిన వారు వెంటనే తమ బ్యాంకు ఖాతాలో జమ చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రధానంగా సిసి రోడ్లు నిలిచిపోయినట్లు ఆయన దృష్టికి వచ్చిందని వెంటనే వాటిని పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధికి 15 కోట్ల నిధులు వెచ్చించినట్లు తెలిపారు. అలాగే ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్ డి ఎఫ్ నిధుల కింద ఐదు కోట్ల రూపాయలు కేటాయించారని వాటిని అవసరమైన చోట వినియోగించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో నాయకులు ప్రజా సమస్యలను తెలుసుకొని అట్టి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, కడెం మండలాలకు సంబంధించి అతి త్వరలో కలెక్టర్ సమక్షంలో అధికారులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగల భూషణ్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, తహసిల్దార్ సుజాత రెడ్డి, ఎంపీడీవో రమాకాంత్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, ఎం పి ఓ రత్నాకర్ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొనికేని దయానంద్ లతోపాటు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన ఆర్డీఎఫ్ విద్యార్థులు




**పర్వతగిరి నవంబర్ 10: (జనం సాక్షి)**నవంబర్ 9, 2025న టెల్లపూర్ హైదరాబాద్ లో జరిగిన సబ్ జూనియర్ స్టేట్ ఆర్చరీ మీట్‌లో ఆర్ డి ఎఫ్ ఆర్చరీ అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో బి. వినయ్ 2వ స్థానం, పి. వినయ్ 3వ స్థానం సాధించగాబీ బాలికల విభాగంలో బి. మనస 1వ స్థానం గెలుచుకుంది. కాంపౌండ్ విభాగం బాలికల నుంచి ఎల్. దేవీలాల 2వ స్థానంలో నిలిచింది. ఈ నలుగురు విద్యార్థులు అరుణాచల్ ప్రదేశ్‌లో జరగబోయే సబ్ జూనియర్ నేషనల్స్‌కు ఎంపికయ్యారు.వ ఈ సందర్భంగా, కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధన్ , కల్లెడ స్కూల్ హెడ్ మాస్టర్ శ్రీనివాస్ మరియు యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. ?ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జనార్దన్ మాట్లాడుతూ, “విద్యతో పాటు క్రీడలలో కూడా మా విద్యార్థులు రాణించడం గర్వకారణం. కోచ్ భరత్ గారి అంకితభావం మరియు పిల్లల కృషి అభినందనీయం. నేషనల్స్‌లో కూడా వీరు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఆశిస్తున్నాము” అని పేర్కొన్నారు. యాజమాన్యం మరియు సిబ్బంది, దేశం తరపున ఆడబోతున్న యువ ఆర్చర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రంయ్యాల శ్రీధరాచార్యులకు బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా సత్కారం




**వరంగల్ ఎంజీఎం, నవంబర్ 10(జనంసాక్షి):**వరంగల్ పోచమ్మ మైదానం సమీపాన గల ఎల్ బి నగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో తెలుగు ఉపాధ్యాయులు ప్రముఖ వ్యాఖ్యాత మరియు గాయకులు తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రంయ్యాల శ్రీధరాచార్యులను ద ప్రైడ్ ఆఫ్ ఇండియా -2025 అవార్డుతో సత్కరించారు.హైదరా బాద్ లోని సుందరయ్య విన కేంద్రం లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జి సి ఎస్ వల్లూరి ఫౌండేషన్ ,శ్రీ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హర్యాన మాజీ గవర్నర్ ,మాజీ కేంద్ర మంత్రి వర్యులు బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా రంయ్యాల అవార్డు అందుకున్నారు. ఫౌండేషన్ జాతీయ చైర్మన్ శ్రీనివాస రాజు సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధిగా రాజ్య సభ సభ్యులు నేషనల్ బి సి ప్రెసిడెంట్ ఆర్ క్రిష్ణయ్య , అతిధులుగా సరస్వతీ ఉపాసకులు దైవ శర్మ,సిని నటులు రామిశెట్టి దొరై స్వామి,ఫౌండేషన్ ఉమెన్ స్టేట్ ప్రెసిడెంట్ కె క్రీష్ణవేణి తదితరులు పాల్గొన్న ఈ కార్య క్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలలోని విభిన్న రంగాలలో కృషి చేస్తున్న వారికి సంస్థ పలు అవార్డులు అందచేసి సత్కరించింది.ఈ కార్యక్రమానికి కాచే క్రీష్ణవేణి,రంయ్యాల శ్రీధరా చార్యులు వ్యాఖ్యాతలు గా వ్యవహరించారు.ం ౕయ్యాల ,క్రిష్ణవేణి,రాధిక ౕ,రాహిమ,ప్రశాంత్,అన్నామణి,ప్రసాద్,కనకరాజు తదితరులు పాడిన పాటలు సభికుల్ని అహ్లాద పరిచాయి.తన కమణీయ మాటలతో మధురమైన పాటలతో కార్య క్రమాలను విజయ వంతం చేస్తూంటారని శ్రీధరా చార్యులను అతిధులు అభినందిస్తు సత్కరించారు.

# బంగల్ చెరువులో పర్యావరణాన్ని కాపాడాలి -స్థానికుల విజ్ఞప్తి



నిర్మల్ బ్యూరో, నవంబర్10, (జనంసాక్షి) నిర్మల్ పట్టణంలోని వినాయక్ సాగర్ (బంగల్ చెరువు)లో పర్యావరణాన్ని కాపాడాలని స్థానికులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరిశుభ్రమైన చెరువులో కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల నుండి వస్తున్న వైద్య వ్యర్థాలు , ఇంజక్షన్ సూదులు, మందు సీసాలు, ప్లాస్టిక్ సంచులు, మైలబట్టలు వంటి చెత్త పడేయడం వలన నీరు తీవ్రంగా కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.చెరువులో ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు స్నానాలు చేయడం, యువత స్విమ్మింగ్ ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం జరుగుతుందని, ఇలాంటి పరిస్థితులు కొనసాగితే ప్రజారోగ్యానికి ప్రమాదమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావిస్తూ, చెరువులో చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, చెరువును కాపాడేందుకు శుభ్రతా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలని వారు కోరారు.ఈకార్యక్రమంలో వెంకటరమణ, గుమ్మల అశోక్, బోడ శ్రీనివాస్, తొగ్గిటి చారి,జంగిటి శ్రీనివాస్, రాజేశ్వర్,తోట రవి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి క్వార్టర్ల కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించలి హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పతెం రాజబాబు



**బెల్లంపల్లి, నవంబర్ 10, (జనంసాక్షి)**బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి క్వార్టర్లు కౌన్సిలింగ్ లో అర్హులకే క్వాటర్స్ కేటాయించాలని హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పతెం రాజబాబు ఆధ్వర్యంలో పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి ఎం శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో గతంలో అర్హులకు కాకుండా అనర్హులకు, ప్రైవేట్ వారికి మంచి క్వాటర్స్ ను కేటాయించి, అర్హులైనా కార్మికులకు నివాసయోగ్యంగా లేని క్వార్టర్లను కేటాయించి తీరని అన్యాయం చేశారన్నారు. కార్మికుల క్వార్టర్లలో మరమ్మత్తులు నామమాత్రంగా చేస్తుండడంతో గోడలు పెచ్చులూడి స్లాబ్ ల నుంచి వర్షం నీరు ఇంట్లోకి వస్తున్నాయన్నారు. దర్వాజాలు ఊడిపోయి క్వాటర్లు అన్ని ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. బెల్లంపల్లి ఏరియాకు బదిలీపై వచ్చిన నూతనంగా విధులలో చేరిన ఉద్యోగులకు కౌన్సిలింగ్ లో క్వార్టర్లు నివాస యోగ్యంగా లేకపోవడంతో బయట ప్రవేట్ ఇళ్లలో అద్దెకు నివసిస్తున్నారని, కార్మికులకు కాలం చెల్లిన క్వార్టర్లను కేటాయిస్తూ కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆర్గనేజర్ సంతోష్, రాజశేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజల సమస్యలు వింటూ పరిష్కారం చేస్తూ



**ఆదిలాబాద్ ప్రతినిది. (జన సాక్షి):** ఓ పక్క ప్రజా సమస్యలు వింటూ వెంటనే పరిష్కారం చేసే విదంగా అడుగులు వేస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా.ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వేగంగా, పారదర్శకంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్ధారించి, పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి, భూభారతి సహా వివిధ విభాగాలకు చెందిన మొత్తం 108 దరఖాస్తులు అందాయని, వాటిని శాఖల వారీగా త్వరితగతిన పరిశీలించి పురోగతి వివరాలు దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. అందెశ్రీ మరణంపై సంతాపం. తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత, కవి అందే శ్రీ మరణవార్తపై సమావేశ మందిరంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ సహా, అధికారులు రెండు నిమిషాల మౌనం పాటించి సంతాపం తెలిపారు.

## ఓపెన్ పది, ఇంటర్ అభ్యర్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



**చెన్నారావుపేట, నవంబర్ 10 (జనం సాక్షి):** చెన్నారావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలోని ఓపెన్ స్కూల్ సెంటర్ లో పది, ఇంటర్ తరగతుల అభ్యర్థులకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అక్రిడియేటెడ్ ఇన్స్టిట్యూట్ కో ఆర్డినేటర్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానుపాటి పాపమ్మ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. 2025-2026 సంవత్సరం అభ్యర్థులకు సోమవారం పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అందరూ బాగా చదివి ఉత్తీర్ణులు కావాలని అలాగే పాఠశాలలో సెలవు రోజులలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ పోలెపల్లి రవి, ఉపాధ్యాయులు వేముల కిషోర్, శ్రీనివాస్ రెడ్డి, మంజుల, సిబ్బంది రాజశేఖర్, సునీల్, సీఆర్ పి సంపత్, సీసీ మంజుల, విఓఏ ఆమని,అభ్యర్థులు సరిత, స్వర్ణలత, జ్యోతి, హేమలత, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జిఎంపిఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శిగా పరికి మధుకర్



**చెన్నారావుపేట, నవంబర్ 10(జనం సాక్షి):** గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శిగా పరికి మధుకర్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్ సోమవారం ప్రకటించారు. నర్సంపేట పద్మశాలి ఫంక్షన్ లో ఆదివారం రోజున జరిగిన జిఎంపిఎస్ వరంగల్ జిల్లా మూడో మహాసభలో చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పరికి మధుకర్ నిరంతరం గొల్లకురుమల, గొర్రెల కాపరుల సమస్యల పై స్పందిస్తూ, అధికారుల దృష్టికి సమస్యలు పరిష్కరించాలని ఆందోళన పోరాటాలను నిర్వహిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నందుకు గాను మూడోసారి జిల్లా కార్యదర్శిగా మధుకర్ ను ఎన్నుకోవడం జరిగిందని ఉడుత రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా పరికి మధుకర్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో జిల్లా కమిటీ సభ్యులు మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు జిల్లా కార్యదర్శిగా బలపరిచిన రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, రాష్ట్ర నాయకత్వానికి, నాకు అండగా నిలిచిన కుల బాంధవులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రానున్న రోజుల్లో గొల్లకురుమల, గొర్రెల కాపరుల సమస్యల పై నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంకై పోరాడుతానని ఆయన తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రలు ప్రారంభం



పెద్దవంగర నవంబర్ 10(జనం సాక్షి ) దళారుల చేతుల్లో మోసపోకండి ప్రతి గింజ కొనుగోలు చేస్తా ఏటీఎం ఎండి పాషా అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పరగూడెం, బొమ్మకల్, కోరిపెల్లి గ్రామాలలో జ్యోతి,జననీ,శ్రీ వేంకటేశ్వర ఐకేపీ గ్రామసమైక్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం ఎండి పాషా,మండల వ్యవసాయ అధికారి స్వామి నాయక్ కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు నిబంధనలకు లోబడి తేమ శాతంతో ప్రభుత్వ మద్దతు ధరకు ఐకేపీ సెంటర్లలో విక్రయించాలని దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సి సి లు సుధాకర్ ,సుజాత,ఉమ ఆపరేటర్ అనిల్, ఆయా గ్రామసమైక్యల వి ఓ లు తదితరులు రైతులు పాల్గొన్నారు..

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**నల్లబెల్లి, నవంబర్ 10 (జనంసాక్షి):** ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నాగరాజు పల్లె గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతోపాటు బోనస్ ను అందజేస్తుందన్నారు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని రైతులకు సూచించారు. తేమశాతం 17 కు మించకుండా , తాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2389, సాదరణ రకం ధాన్యానికి రూ.2369 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందిని తెలిపారు. కాంటలైన రెండు మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ రేణుక దేవి, ఏడిఏ దామోదర్ రెడ్డి, తహసిల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీవో శుభానివాస్, ఏవో బన్న రజిత, ఎస్సై రవీందర్ రెడ్డి, ఏపిఎం సుధాకర్ ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ రమేష్, నర్సంపేట మండల పార్టీ అధ్యక్షుడు కత్తి కిరణ్,మండల ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాలా అశోక్, మండల నాయకులు చిట్యాల ఉపేందర్ రెడ్డి, అజ్మీర తిరుపతి, పోగుల కుమారస్వామి, వద్లూరి రమేష్, చెంచు సంజీవ, పైడి,పంచాయతీ కార్యదర్శి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల జీవితాలలో వెలుగులు నింపింది కమ్యూనిజం



**గంగారం నవంబర్ 10 (జనం సాక్షి)**కోమట్ల గూడెం గ్రామంలో కామ్రేడ్ పుల్లన్న సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు అధ్యక్షతన కామ్రేడ్ లక్ష్మన్న స్మారక బహిరంగ సభను గంగారం మండలం కోమట్ల గూడెం గ్రామంలో నిర్వహించడం జరిగింది. సభకు గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించి, గోగ్గల లక్ష్మన్న స్తూపం పై జెండా ఆవిష్కరణ చేసి తన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆవిర్భవించిందని, దున్నేవానికి భూమి కావాలనే నినాదంతో నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తూ లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు సాధించి పెట్టిందని, భూమి సేద్యం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తూ ఆత్మగౌరవంతో బ్రతుకుతున్నారని వారు తెలిపారు. నేటి పాలకులు దేశ సంపద ను దళారులుగా మారి బహుళ జాతి కంపెనీలకు దోచిపెడుతున్నారని, పలు అభివృద్ధిని చేశారు అది సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకత్వంలో ప్రజలు సాధించుకున్న విజయాలుగా చెప్పవచ్చు. ఆ క్రమంలో విప్లవోద్యమంలో కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి నుండి మొదలుకొని రామ నర్సయ్య , నీలం రామచంద్రయ్య, జంపాల ప్రసాద్, దొరన్న, ఎల్లన్న, గణేషన్న, పెద్ద బూర్క వెంకటన్న,లింగన్న గొగెల లక్ష్మన్న, ఈసం జనార్ధన్, కుంజ ఎర్రన్న, శేషన్న, పడిదల శ్రీను, నారాయణ,లాంటి ఎందరో అమరవీరులు ఈ సమాజ మార్పు కొరకు తమ ప్రాణాలను త్యాగం చేశారని వారు కీర్తించారు. వారి ఆశయ సాధన కోసం తుదికంట పోరాడాలని వారు పిలుపునిచ్చారు. అదే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ సంస్మరణ సభలో బండారి ఐలయ్య సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు,బూర్క వెంకటయ్య,శ్రీశైలం లు ప్రసంగించారు, సువర్ణపాక పుల్లక్క మాజీ జెడ్పిటిసి, ఈసం సారయ్య, తాళ్లపెల్లి కొమురయ్య,జనగాం కాంతారావు, గొగెల చిన్న లక్ష్మయ్య మాజీసర్పంచ్,గట్టి సురేందర్, సమ్మయ్య,పూర్ణచందర్, రాజా, జామ్లా, లక్ష్మయ్య, వెంకన్న, ఐలబోయిన నరేష్, మహేందర్, అరుణోదయ సాంస్కృతిక సమైక్య డప్పుదళం కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మజకు సువర్ణ కంకణ సత్కారం

**బెల్లంపల్లి, నవంబర్ 10, (జనంసాక్షి)**బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు పద్మజకు సువర్ణ కంకణ సత్కారం చేశారు. గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ, శ్రీకార్యాన్ని సకల కళా వేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయి రికార్డు కవితల పోటీలో అరగంటలో అప్పటికప్పుడు ఇచ్చిన మూడు అంశాలకు కవితలు రాసి అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో సువర్ణ కంకణ సత్కారం చేశారు. శ్రీమతి దూడపాక లక్ష్మి జ్ఞాపకార్థం నిర్వహించిన కవితల పోటీల్లో నా ఊహలో కవిత రాసి విజేతగా నిలిచారు. ఇందుకు గాను కరీంనగర్ ఫిలిం సిటీ వేదికగా జాతీయ స్థాయి బహుమతి అందజేశారు. ఒకే వేదికపై రెండు సత్కారాలు పొందిన పద్మజను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీధర్, ప్రముఖ కవి వైరాగ్యం ప్రభాకర్, సంస్థ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ అభినందించారు.



## క్రీడాకారులు ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం గోడప్రతి విడుదల

**శ్రీరాంపూర్(జనంసాక్షి):**క్రీడాకారులు,అధికారుల,ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం బ్రోచర్,గోడ ప్రతిని సోమవారం జీఎం కార్యాలయంలో క్రీడాకారులతో కలిసి జీఎం శ్రీనివాస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతు శ్రీరాంపూర్ ప్రగతీ స్టేడియం,సీ ఈఆర్ క్లబ్బు ప్రారంభించుకొని 33 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరిగిందని,నవంబర్ 30న ప్రగతీ స్టేడియంలో క్రీడాకారులు ,అధికారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్సి ఎస్కే బాజీసైదా,డీవైజీఎం అనిల్ కుమార్,అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్రెడ్డి,ఆత్మీయ సమ్మేళనం కోఆర్డినేటర్ జీ యాదిరెడ్డి, సంయుక్త కోఆర్డినేటర్ ఇసంపెల్లి రాంచందర్,సబ్యులు రాజేశం,రాళ్లబండి రాజన్న, శ్యాంసుందర్ పాల్గొన్నారు



# రాజశ్రీ పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 10 (జనం సాకి**రాజశ్రీ పెరటి కోళ్ల పెంపకంతో పోషకాహార లోపాన్ని అరికట్టడమే కాకుండా అదనపు ఆదాయం లభిస్తుంది అని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మరియు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ బిందు మాధురి తెలిపారు. సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయ%శీ% పరిదీ లోని గవిచర్ల గ్రామ%శీ% లోని 130 రైతులకు పెరటిలో పెంచుకోవడానికి అనువైన రాజశ్రీ కోళ్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ బిందు మాధురి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని రైతులు ఎక్కువగా పిండి పదార్థాలతో ఉన్న ఆహారమే తీసుకోవడం మూలంగా వాళ్ళల్లో ప్రోటీన్ లోపం ఎక్కువగా ఉంటుంది అదేవిధంగా గర్భిణీలుకు అవసరమైనటువంటి ప్రోటీన్ దొరకక పుట్టేటువంటి పిల్లలు తక్కువ బరువుతో ఉండడం, ఎనీమియా (తక్కువ రక్త కణాల సంఖ్య) కూడా ఉండడం జరుగుతుంది. అందుకని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం వారు ఇంటి ఆవరణంలో పెంచుకొనడానికి వీలైనటువంటి రాజశ్రీ కోళ్లను రూపొందించడం జరిగిందన్నారు. ఈ రాజశ్రీ కోళ్ల కు అవసరమైన వ్యాధి నిరోధక టీకాలను అన్ని ఇచ్చిన తర్వాత ఈ రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఇవి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి కుక్కలు, పిల్లులు, జంతువుల నుంచి కాపాడుకోవడానికి అనుకూలంగా వీటిల్లో శరీరం మధ్యస్థ పరిమాణంలో ఉండి, కాళ్లు పొడవుగా ఉంటాయి. వీటి ద్వారా వచ్చినటువంటి గుడ్లను వేరే కోళ్ల ద్వారా పొదిగించుకొని కూడా పెంచుకోవచ్చు. పొదిగించగా వచ్చినటువం టి కోడి పిల్లలను సుమారుగా ఒక పది రోజులు ఒక చిన్న ప్రదేశంలో ఉంచి వాటికి బల్బ్ ను ఉంచినట్లయితే వాటికి కావలసినటువంటి ఉష్ణోగ్రత అందుతుంది కాబట్టి అవి తొందరగా పెరగడానికి అస్కారం ఉంటుంది. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక ఆదాయాన్ని సమకూర్చుకోవాలని మరియు పోషకాలు గల మాంసాన్ని పొందాలని కోరారు. డా సాయి కిరణ్ శాస్త్రవేత్త పెరటిలో ఈ కోళ్లను ఎలా పెంచుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ బిందు మాధురి, శాస్త్రవేత్తలు డాక్టర్ జె సాయి కిరణ్, డా సౌమ్య, డాక్టర్ రాజు, డా అరుణజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

# తుపాన్ బాధితులకు భారత సేవాశ్రమ సంఘ్ చేయూత



**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 10(జనం సాక్షి):**భారత సేవాశ్రమ సంఘ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతంలోని తుఫాన్ "మోంథా" ప్రభావిత ప్రజలకు సహాయక కార్యక్రమాన్ని ప్రారంభించింది. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద బాధితులకు సహాయ వస్తువులు పంపిణీ చేసికార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ ఖిలా వరంగల్ మండలం ఎన్ ఎన్ నగర్, మైసయ్య నగర్వ, వరంగల్ మండలం ఎన్టీఆర్ నగర్, ఎస్సీ కాలనీ , ఎస్ ఆర్ నగర్‌లి, ప్రాంతాల్లోతుఫాన్ బాధితులకు భారత సేవాశ్రమ సంఘ్ ద్వారా అవసరమైన వస్తువులు అందించడం అభినందనీయమని తెలిపారు. భారత సేవాశ్రమ సంఘ్ సెక్రటరీ స్వామి మునీశ్వరానంద మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు 1000 టి షర్ట్స్ , 1000 చీరలు, 1000 ధోతీలు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, ఏఓ విశ్వప్రసాద్, తహసీల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్, నవంబర్ 10 (జనం సాక్షి):** జిల్లా ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారయోగ్యమైన వాటిని వెంటనే పరిష్కరించాలనీ, లేనిపక్షంలో దరఖాస్తుదారులకు తగిన సూచనలు, సలహాలు అందించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రాజీవ్ కాలనీకి చెందిన గుర్రం కృష్ణవేణి తన దివ్యాంగత్వం కారణంగా ఉపాధి కల్పించాలంటూ దరఖాస్తు సమర్పించగా, దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన కొత్తపల్లి మల్లమ్మ భూమి వివాద పరిష్కారాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన రాజు, వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సర్వే ల్యాండ్ అధికారి నరసింహమూర్తి, హార్టికల్చర్ అధికారి జి. మరియన్న, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, గ్రౌండ్ వాటర్ డిడి వేముల సురేష్, సివిల్ సప్లై డిఎం కృష్ణవేణి, వెల్ఫేర్ అధికారిణి సబిత, ఇండస్ట్రీస్ జిఎం శ్రీమన్నారాయణ రెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీ రామ్ నాయక్, మెప్మా పిడీ విజయ, ఎంప్లాయిమెంట్ అధికారిణి రజిత, కలెక్టరేట్ పర్యవేక్షకుడు మదన్ గోపాల్‌తో పాటు వివిధ మండలాల డిప్యూటీ తహసీల్దారులు, మున్సిపల్ మేనేజర్లు, శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిఎం కార్యాలయంలో మిషన్ హెల్తి సింగరేణికార్యక్రమం



**శ్రీరాంపుర్(జనంసాక్షి):**ఏరియా సింగరేణి జిఎం కార్యాలయంలో యోగా గురువు షణ్ముక శివ చంద్రచే ప్రాచీన యోగా దినచర్య,మిషన్ హెల్తి సింగరేణి కార్యక్రమన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ సిఎండి బలరాం ఆదేశానుసారం ఉద్యోగులకు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరగిందని, ఉద్యోగులు ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు యోగ ఆచరించి ఆరోగ్యవంతులుగా ఉండాలని తెలిపారు. అనంతరం పదిహేను సంవత్సరాల శాస్త్రీయ పరిశోధన అవగాహన కార్యక్రమంలో భాగముగా యోగా వలన కలుగు ఫలితాలు,ఆరోగ్య పరిరక్షణ కొరకు తీసుకోవలసిన చిన్న పాటి సూక్ష్మ వ్యాయామాల మీదా,జబ్బుల నివారణ తదితర వాటి మీదా అవగాహన కార్యక్రమమును యోగా గురువు షణ్ముక శివ చంద్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘ0 బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా,డీజిఎంలు ఎస్ అనిల్ కుమార్,రాజన్న, హరినారాయణ,ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి,ఏరియా సర్వేధికారి నర్సింగ రావు,వృత్తి శిక్షణా కేంద్రం అధికారి కమ్రుద్దీన్,జిఎం కార్యాలయ ఉద్యోగులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాలను అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి ,నవంబర్ 10, (జనంసాక్షి)**మంచిర్యాలను అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం మండలంలోని ఓ. బి.లు, వి. ఓ. ఎ. లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అమ్మకు అక్షరామాల కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమం లో భాగంగా నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించుట కొరకు వాలంటీర్ టీచర్స్ ను గుర్తించి ఉల్లాస్ ఆప్ లో నమోదు చేయడం జరిగిందని, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే ఈ కార్యక్రమంను విజయవంతం చేయడానికి ప్రతి గ్రామ సంఘం నుండి ఇద్దరు ఓ . బి.లు, వి . ఓ . ఎ.లకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన సి.ఆర్. పి. లచే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని, అంకితభావంతో అందరూ కలిసి విజయవంతం చేసి జిల్లాను అక్షరాస్యతలో ప్రథమ స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం , జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ఏ పీ ఎం శ్రీనివాస్ గౌడ్ , మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ సర్వేయర్లకు గౌరవితనం ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం

**సారంగాపూర్,అక్టోబర్10(జనం సాక్షి)**నిర్మల్ జిల్లా లైసెన్స్ సర్వేయర్లు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ అభిలాష అభినవ్ కి వినతిపత్రం అందజేశారు. ఐదు నెలల శిక్షణ అనంతరం ఉత్తీర్ణత సాధించి, లైసెన్సులు పొంది చాలా రోజులు అయినా విధుల్లోకి తీసుకోకపోవడం అన్యాయమని వారు ఆరోపించారు. భూభారతి చట్టం అమలులో భాగంగా లైసెన్స్ సర్వేయర్ల వ్యవస్థను బలోపేతం చేస్తూ భూ వివాదాల పరిష్కారానికి తీసుకున్న నిర్ణయాన్ని హర్షం వ్యక్తం చేశారు. తమ శ్రమకు తగ్గ ఫలితం కావాలని, నెలవారీ గౌరవ వేతనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్వేయర్లు పాల్గొన్నారు.



## టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా రమేష్



**కాటారం నవంబర్ 11( జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కేంద్రానికి చెందిన గాదె రమేష్ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సీనియర్ జర్నలిస్ట్ విజయ క్రాంతి పత్రిక పని చేస్తున్న రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు ఎర్రం సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటేశ్వర్లు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కొలుగూరి సంజీవరావు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూజర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఉద్యమిస్తూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్న రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మహా రుద్ర యాగ ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డిఓ



**పరకాల, నవంబర్ 10 (జనం సాక్షి):** పరకాల పట్టణంలోని కుంకుమేశ్వరాలయంలో ఈనెల 17న నిర్వహించ తలపెట్టిన మహా రుద్రయాగ ఏర్పాట్లను సోమవారం రోజున అధికారులతో కలిసి పరకాల ఆర్డిఓ కే. నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి రుద్ర యాగాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కే. సుష్మ, ఆలయ చైర్మన్ కొలగూరి రాజేశ్వరరావు, రుద్రయాగ సమితి అధ్యక్షులు ఎర్ర లక్ష్మణ్, కన్వీనర్ గందే రవి, కోశాధికారి తోట భద్రయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, పిట్ట వీరస్వామి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18 నుండి సైన్స్, టెక్నాలజీలో ఇన్నోవేషన్ పోటీలు

### జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రఘు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా స్థాయి యువజనోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా 18 నుండి సైన్స్, టెక్నాలజీలో ఇన్నోవేషన్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సిహెచ్ రఘు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు గాను నిర్వహిస్తున్న ఈ పోటీలలో గ్రూపు జానపద నృత్యం, గ్రూపు జానపద పాటలు, సైన్స్ మేళా (ఏదైనా ఇన్నోవేషన్ మోడల్ కి సంబంధించినది) లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్, (కథా రచన, కవిత్వం, ప్రకటన, పెయింటింగ్) కార్యక్రమాలు ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 96180 11096, 8125113132 లను సంప్రదించాలని ఆయన కోరారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి :సిపిఎం

**భీమదేవరపల్లి నవంబర్ 10(జనం సాక్షి)** మెంతా తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడి రాజుల రాములు డిమాండ్ చేశారు.మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పంట నష్టాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,వరికి మొక్కజొన్నకు పత్తికి తోడు ఇతర పంటలకు కూడా గణనీయమైన నష్టం జరిగింది. యూరియా అందక ఇబ్బందులు పడిన రైతులు ఇప్పుడు తుపానుతో తీవ్ర నష్టాన్ని చవిచూశారు. ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి.ప్రతి రైతుకూ సరైన నష్టపరిహారం అందేలా చూడాలి అన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అజ్మీరా బిక్షపతి,మండల కమిటీ సభ్యులు భూనాద్రి వెంకటేశ్వర్లు,బానోతు తిరుపతి,బానోతు రాజు,వేలు రజిత తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



**ఖానాపూర్ నవంబర్ 10 (జనం సాక్షి)** రైతుల సౌకర్య%శీ% కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం సత్తనపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో రైతుల పండించిన వరి ధాన్యాన్ని విక్రయించి లాభాలు గడించాలని అన్నారు.కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి రైతుల సౌకర్యం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం సత్తనపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతుల పండించిన వరి ధాన్యాన్ని విక్రయించి లాభాలు గ్రహించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగల భూషణ్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, పిఎసిఎస్ సత్తెనపల్లి చైర్మన్ ఆమంద శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, తహసిల్దార్ సుజాత రెడ్డి, ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ లు అంకం రాజేందర్, రాజురా సత్యం లతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 10, (జనంసాక్షి)** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కాసర్ల శ్రీనివాస్, మంచు శంకర్ లు తమ దరఖాస్తులో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని, ప్రతి నెల సదరం శిబిరాలు నిర్వహించాలని కోరారు. మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన బచ్చలి ప్రవీణ్ కుమార్ మండలంలోని తుర్కపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన ఇల్లందుల రాజమణి తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ తన దరఖాస్తులో అడ్డా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. చెన్నూర్ మండలం ఆస్నాద్ గ్రామానికి చెందిన రామిళ్ళ ప్రమీల తనకు 2013లో ప్రభుత్వం భూమిని పట్టా ఇచ్చిందని, ఇట్టి పట్టాను డిజిటలైజ్ చేసి నూతన పట్టా పాస్ పుస్తకం మంజూరు చేసి తనకు భూమిని చూపించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గవ్వల శంకరయ్య మండలంలోని రెబ్బెనపల్లి గ్రామ శివారులో తన తల్లి నుండి వారసత్వంగా వస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని అశోక్ రోడ్ ప్రాంతానికి చెందిన బెజ్జంకి రమ తన భర్త కంచరీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే వారిని, తనకు పక్షవాతం రావడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, భర్తకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన ఆసరి రాజలక్ష్మి నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులుపాల్గొన్నారు.

# మండల కేంద్రంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ



**మహదేవపూర్: నవంబర్ 10 (జనంసాక్షి)** ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి కూడలి వద్ద వచ్చిపోయే వాహనాలను విస్తృతంలో తనిఖీనిర్వహించారు. వాహనాలను తనిఖీ కార్యక్రమంలో భాగంగా వాహనాల ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ను క్షుణ్ణంగా పరిశీలించి సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనాలకు సరియైన ధ్రువపత్రాలు లేనిచో మద్యం సేవించి వాహనం నడిపినచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై పవన్ కుమార్ హెచ్చరించారు. ఆయన వెంట సెకండ్ ఎస్సై శశాంక్. సివిల్ సిఆర్పిఎఫ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# నిర్లక్ష్యపు నీడలో 'వైకుంఠధామం'!

- పట్టించుకునేవారే లేక అడవిని తలపిస్తున్న వైనం
- అసంపూర్తిగానే వైకుంఠధామం నిర్మాణ పనులు...
- పంచాయతీరాజ్ అధికారుల అలసత్వమే...ప్రధాన కారణం అంటూ గ్రామస్తులు ఆరోపణ
- అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్షలాది రూపాయలు నిర్వీర్యం...



**మంగపేట నవంబర్ 10(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామ గ్రామాన వైకుంఠధామాలను ఏర్పాటు చేయాలని దృఢ సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2020%-%2021 ఆర్థిక సంవత్సరంలో ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను ఏర్పాటు చేస్తూ వచ్చింది. కానీ ఇక్కడ మాత్రం నేటి వరకు కూడా సంబంధిత కాంట్రాక్టర్ పూర్తిగా పనులను పూర్తి చేయకపోవడంతో నేటికీ వినియోగంలోకి లేకుండా పోయింది. ఈ వైకుంఠధామం నిర్మాణం విషయంలో పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో నిర్లక్ష్యపు నీడలో 'వైకుంఠధామం'....! అనే తీరుగా మారిపోయింది అని మండలంలోని కొత్తూరు మోట్లగూడెం గ్రామానికి చెందిన గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వైకుంఠధామానికి సుమారు 12 లక్షల రూపాయల నిధులు మంజూరు కాగా సంబంధిత కాంట్రాక్టర్ మాత్రం నిర్మాణ పనులను పూర్తి చేయకుండా చేతుల దులుపుకొని అలసత్వం ప్రదర్శించి కనీసం సూచిక బోర్డులు గాని నేమ్ బోర్డు కూడా కనిపించడం లేదు. అంటే సంబంధిత ఇంజనీర్లు, పంచాయతిరాజ్ అధికారుల పనితీరు ఎక్కడే తేటతెల్లమవుతుంది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మిస్తే నేటికి కూడా ఎటువంటి ఉపయోగం లేకుండా నిర్వీర్యంగా మారిపోయింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్నటువంటి గ్రామపంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బంది కూడా కానీ వైకుంఠధామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని గ్రామస్తులు మండిపడుతున్నారు. సుమారు 12 లక్షల రూపాయి నిధులతో నిర్మించిన వైకుంఠధామం ఇంకా పనులు అసంపూర్తిగానే పరిశ్రమిస్తున్నాయి కనీసం నిర్మాణం చేపట్టిన గదులకు కూడా తలుపులు గాని కిటికీలు గాని ఏర్పాటు చేయకుండా అలానే అర్థవంతంగా పనులను వదిలేశారు అని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి వెంటనే వైకుంఠదామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

## సమస్యల పరిష్కారం కోసం అధికారులు చురుకుగా వ్యవహరించాలి

సందర్శనలో విద్య తో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా పర్యవేక్షించాలన్నారు. అలాగే, పాఠశాలల్లో శుభ్రత, తాగునీటి సౌకర్యాలు మరియు హాస్టల్ వాతావరణం మెరుగుపర్చే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడంలో స్ఫూర్తి కార్యక్రమం జిల్లాలో మంచి ఫలితాలు ఇస్తున్న నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలు, ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు, సంబంధిత అధికారులు పాల్గొని విద్యార్థుల మానసిక దృఢత్వాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి గణపతి, ఆర్డీఓ ఉమారాణి,వివిధ జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన బలరాం జాదవ్



**నెరడిగొండ నవంబర్ 10 (జనంసాక్షి):** ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పేర్కొన్నారు. సోమవారం రోజున బోథ్ మండలంలోని మర్లపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇందూర్ మహేష్ అనే వ్యక్తి ఇల్లు అగ్నికి ఆహుత్తైందన్న విషయం తెలుసుకున్న రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ వారిని ఓదార్చడానికి ఆ గ్రామానికి వెళ్ళారు. మహేష్ కుటుంబం పరిస్థితి చూసి చలించిన బలరాం ఆ కుటుంబాని ఆర్థిక సాయం చేసారు.ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కట్టు బట్టలతో బయటపడిన కుటుంబానికి మర్లపల్లి పాఠశాల ఉపాధ్యాయులు కూడా ఆర్థిక సహాయం అందించారు. రోడ్డున పడ్డ మహేశ్ కుటుంబానికి తహసిల్దార్ చొరవ తీసుకొని సహాయం త్వరగా అందేట్టు చూడాలని అన్నారు.

## జోనల్ స్థాయి అథ్లెటిక్స్‌లో కాంస్య పథకం



**బెల్లంపల్లి, నవంబర్ 10, (జనంసాక్షి) :** ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన జోనల్ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో బెల్లంపల్లి కృష్ణవేణి పాఠశాలకు చెందిన కే దీక్ష 14 సంవత్సరాల బాలికల విభాగంలో 100 మీటర్ల హార్డిల్స్ పరుగు పందెంలో కాంస్య పథకం సాధించిందని పాఠశాల డైరెక్టర్ ఈ రవి ప్రసాద్, ప్రిన్సిపల్ యం రాజా రమేష్ తెలియజేశారు. వారు మాట్లడుతూ విద్యతో పాటు క్రీడలలో పాల్గొనడం ద్వారా మనసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడల పట్ల మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని, శారీరక ఆరోగ్యానికి మేలు చేస్తాయని అన్నారు. అనతరం మెడల్ సాధించడానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు సల్పాల సంతోష్ యాదవ్, వడ్నాల మల్లేష్ యాదవ్ ను అభినందించారు.

## 11వ జోనల్ స్థాయి క్రీడలలో సత్తా చాటిన కాసిపేట గురుకుల విద్యార్థులు

- అభినందించిన ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్



**బెల్లంపల్లి, నవంబర్ 10, (జనంసాక్షి) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల 11వ జోనల్ స్థాయి క్రీడలు ములుగు జిల్లా జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల మైదానంలో ఈనెల 6 నుండి 8 వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పోటీలలో కాసిపేట గురుకుల విద్యార్థులు అథ్లెటిక్ విభాగంలో అండర్ 14, అండర్ 17 లలో ఓవరాల్ ఛాంపియన్షిప్, అండర్ 14 అథ్లెటిక్ లో ఏ మధు వ్యక్తిగత చాంపియన్షిప్ సాధించాడని తెలంగాణ సాంఘిక సంక్షేమ కాసిపేట గురుకుల ప్రిన్సిపాల్ పూటూరి సంతోష్ కుమార్ తెలిపారు. కాసిపేట గురుకుల విద్యార్థులు అన్ని విభాగాల్లో సత్తా చాటి 22 పథకాలు సాధించారని వివరించారు. స్వర్ణం 7, రజితం 8 , కాంస్యం 7 అలాగే అండర్ 14 చెస్, కబడ్డీలో రన్నరపుగా నిలిచారన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన అభినందన సభలో పథకాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో విద్యార్థులు రాష్ట్ర ,జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, జెవిపి, పిడి హరీష్, పిఈటి రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గ్రానైట్ లారీ డ్రైవర్లకు కౌన్సిలింగ్..

- మద్యం సేవించి వాహనాలు నడపరాదు..
- డ్రైవర్లు తగినంత విశ్రాంతి తీసుకోవడం మంచిది.
- తొర్రూరు ఎస్సై గొల్లమూడి ఉపేందర్

**తొర్రూరు, నవంబర్ 10 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై నిరంతరం సంచరిస్తున్న గ్రానైట్ లారీల డ్రైవర్లకు తొర్రూరు ఎస్సై గొల్లమూడి ఉపేందర్ సోమవారం తొర్రూరు పట్టణంలోని దుబ్బ తండ భారత్ పెట్రోల్ బంక్ వద్ద కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉపేందర్ మాట్లాడుతూ, గ్రానైట్ లారీ డ్రైవర్లు అధిక బరువుతో వాహనాలు నడపకూడదని, వాహనాల స్పీడును నియంత్రించి నెమ్మదిగా, జాగ్రత్తగా నడపాలని సూచించారు. వాహనం నడిపే ముందు తగినంత విశ్రాంతి తీసుకోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. అదేవిధంగా గ్రానైట్ లారీల అనుమతిపత్రాలు, రవాణా చలాన్లు తనిఖీ చేసి, అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని డ్రైవర్లను ఆదేశించారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని ఆయన సూచించారు. అనంతరం వరంగల్%-%ఖమ్మం జాతీయ రహదారిపై ఎక్కువ గుంతలమయంతో ప్రమాదాలు సంభవిస్తుండడంతో పోలీస్ అధికారులు స్పందించి జాతీయ రహదారిపై పడిన గుంతలను దగ్గరుండి తొర్రూరు ఎస్ఐ గొల్లమూడి ఉపేందర్ పూడ్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజు, పరమేశ్, బావ్ సింగ్, మధు, అలాగే లారీ డ్రైవర్లు, క్లీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలకు 50 ఫ్యాన్ల బహూకరణ



**చెన్నారావుపేట, నవంబర్ 10 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు 50 ఫ్యాన్ లను బహూకరించారు. చెన్నారావుపేట మండల విద్యాశాఖ అధికారిని బైరి సరళ, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ మెట్టుపల్లి జ్యోతి ఆధ్వర్యంలో జల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పుల్లూరి జగన్మోహన్ ద్వారా రూరల్ స్కూల్ ఎంపవర్మెంట్ సంస్థ తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా యూఎస్ఏ కు చెందిన కేశవరాజు కస్తూర్బా బాలికల పాఠశాలకు రూ.1 లక్ష 15 వేల విలువగల 50 సీలింగ్ ఫ్యాన్ లను విద్యార్థుల సౌకర్యార్థం అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం ఫ్యాన్లు బహుకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అందెశ్రీ మృతి పట్ల సంతాపం

**బెల్లంపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అధికార గీత రచయిత, ప్రముఖ ప్రజా గాయకుడు అందెశ్రీ మృతి పట్ల బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ ఉద్యమానికి ఆయన గీతాలు, గానం ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు. జయ జయహే తెలంగాణ గీతం రూపంలో ఆయన రచనలు ప్రతి తెలంగాణ వాసి హృదయంలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. మాయమై పోతున్నడమ్మ మనిషన్న వాడు అనే గీతం ప్రతి హృదయాన్ని కదిలిస్తుందని అన్నారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

### అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటు

**చెన్నారావుపేట, నవంబర్ 10(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర కవి, ఉద్యమకారుడు, సాహితీవేత్త అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటని చెన్నారావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు సిద్ధన రమేష్ తెలిపారు.ఆయన ఆకస్మిక మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు.

### ముల్కనూర్ లో అందెశ్రీ చిత్రపటానికి ఘనంగా నివాళులు



**భీమదేవరపల్లి నవంబర్ 10(జనం సాక్షి) :** అనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరలో సోమవారం అంబేద్కర్ కూడల వద్ద ప్రజా సంఘాల నాయకులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజా కవి తెలంగాణ ఉద్యమకారుడు అందె శ్రీనివాస్ (అందెశ్రీ) చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోమండల జేఏసీ చైర్మన్ ద్యాగల సారయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,మాజీ ఉపసర్పంచ్ కొలుగూరి రాజు, హుస్నాబాద్ జేఏసీ లక్ష్మారెడ్డి,మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, మండల సురేందర్,రేణిగుంట్ల బిక్షపతి,ఎమ్మార్పీ ఇన్‌చార్జి వెంకటస్వామి,అప్పని బిక్షపతి, మంగ రామచందర్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప, శారద, మాడుగుల అశోక్,కండే చిరంజీవి,గడిపే వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్లో గాయత్రి వన్ గ్రామ్ గోల్డ్ షాప్ ప్రారంభం

**వరంగల్ ఈస్ట్, నవంబర్ 10 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని బట్టల బజార్లో సోమవారం గాయత్రి వన్ గ్రామ్ గోల్డ్ ఇమిటేషన్ జ్యువెలరీ షాపు ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు యజమానులు కోడం శివకృష్ణ శైలజ మాట్లాడుతూ ఇటీవల కాలంలో విపరీతంగా బంగారం ధర పెరగడంతో సామాన్య పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వన్ గ్రామ్ గోల్డ్ నగలను తమ షాపులో తయారు చేయించి అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఒరిజినల్ గోల్డ్ కంటే మరింత మెరిసే విధంగా తమ వద్ద అన్ని రకాల ఆర్నమెంట్స్ తయారు చేయించి అందుబాటులో సరసమైన ధరలకు అమ్ముతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రారంభించిన గాయత్రి వన్ గ్రామ్ గోల్డ్ ఇమిటేషన్ జ్యువెలరీ షాపును పలువురు ప్రముఖులు సందర్శించి కోడం శివకృష్ణశైలజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## 108 వాహనం ఆకస్మిక తనిఖీ



**పర్వతగిరి నవంబరు 11 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో 108 వాహనం ఆకస్మిక తనిఖీ పర్వతగిరి మండల కేంద్రంలోని 108 వాహనాన్ని సోమవారం వరంగల్ ఈ ఎం ఈ భరత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేసారు ఈ సందర్బంగా అంబులెన్సులోని పరకరాలను రిజిస్టర్లునూ పరిశీలించి సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నావ్ వారికీ తగిన సూచనలు చేయడం జరిగింది సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది ఎల్లపుడు అప్రమత్తం గా ఉండాలని సకాలంలో ప్రజలకు సేవలు అందించాలని విధుల పట్ల అలసత్వం ప్రదర్శించవద్దని రోజువారీ సేవలు నిరంతరాయంగా అన్నదించాలని ప్రజలు కూడా 108 అంబులెన్సు సేవలను వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో సిబ్బంది పైలట్ రమేష్ శ్యామ్ పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నెక్కొండ, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** నెక్కొండ మండలం కేంద్రంలోని గొట్లకొండలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి ఈ కార్యక్రమంలో రంజిత్ రెడ్డి, మాట్లాడుతూ రైతుల కోసం అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయికృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పోలిశెట్టి భాను ప్రకాష్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, నర్సంపేట కోర్టు ఏజిపి అడ్వకేట్ బండి శివకుమార్, మార్కెట్ డైరెక్టర్లు రావుల మహిపాల్ రెడ్డి, బొమ్మెరబోయిన రమేష్, కును సోత్ నైజాం శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణ జ్యోతి గ్రామైక సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ములుగు,వెంకటాపూర్, నవంబర్10 (జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో స్వర్ణ జ్యోతి గ్రామైక సంఘం ఆధ్వర్యం లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను ప్రారంబించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిసి బీమా నాయక్,గ్రామ వివో లు బల్ల నాగరాణి, మంతెన రమ, మహిళా సంఘం అధ్యక్షులు బండి కోమల,కార్యదర్శి పోలుదాసరి లలిత,బుక్ కీపింగ్ బల్ల రాధిక, మహిళా సంఘం సభ్యులు ఇటికాల సుమలత, ఇటికాల సుకన్య, బండి నందిని,సాధ అనిత, రామగిరి శ్రావ్య మహిళా సంఘం సభ్యులు,రైతుల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది.నల్లగుంట గ్రామ మహిళా సంఘ సీసీ భీమా నాయక్ మాట్లాడుతూ రైతులందరూ మీరు పండించిన పంటను ప్రభుత్వ ఇచ్చే గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని మహిళా సంఘాలకు వరి ధాన్యం అమ్ముకొని లాభం పొందాలని కోరారు.దళారులను నమ్మి వరి ధాన్యం అమ్ముకొని మోసపోవద్దని తెలిపారు.ప్రతి రైతు సన్న వడ్ల కు ప్రభుత్వం ఇచ్చే బోనసును పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు మాజీ ఉప సర్పంచ్ భూక్యా శంకర్, మందల మధుకర్ రెడ్డి, పిన్ రెడ్డి భూమిరెడ్డి,పులి మధుసూదన్ రెడ్డి, పిన్ రెడ్డి రాజిరెడ్డి,బండి సాంబయ్య,పిన్ రెడ్డి సంజీవరెడ్డి,బల్ల చంద్రయ్య,సాద రమేష్, మెరుగు మల్లయ్య, హమాలి ఇతర రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వడాన్ని విరమించుకోవాలి

- **మధ్యాహ్న భోజన కార్మికులకు 10 వేల వేతనం ఇవ్వాలి**
- **మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ**



**భూపాలపల్లి, నవంబర్ 10 (జనం సాక్షి):** మధ్యాహ్న భోజన పథకాన్ని సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం ప్రైవేట్ సంస్థలకు ఇవ్వరాదని, రాష్ట్రంలో కొడంగల్ నియోజకవర్గంలో అక్షయపాత్రకు ఇవ్వడాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల గౌరవ వేతనం ఒప్పుకున్నారని, వెంటనే గౌరవ వేతనం అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు కోడిగుడ్లు, 9, 10 వ తరగతి విద్యార్థుల బిల్లులు, 2000 అల్పాహార బిల్లులను విడుదల చేయాలన్నారు. కోడిగుడ్లు నిత్యవసర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. కార్మికులకు సంవత్సరానికి 10 నెలలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారని దాన్ని 12 నెలలకు ఇవ్వాలని అన్నారు. కార్మికులకు ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని సుగుణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన వర్కర్స్ భానుమతి, సుగుణ, స్వరూప, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యాచరణ

- **జన సంచార ప్రాంతాల్లో వీధి కుక్కలు సంచరించకుండా అనిమల్ వెల్ఫేర్ బోర్డు నిబంధనలు పాటించాలన్న మేయర్...**
- **ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ శానిటేషన్ అధికారులతో సమావేశం...**




**వరంగల్ ఎంజీఎం,నవంబర్ 10(జనంసాక్షి):** నగరం లోని జన సంచార ప్రాంతాల్లో వీధి కుక్కలు ఉండకుండా సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణం గా కార్యాచరణ (యాక్షన్ ప్లాన్)సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు.సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో వీధి కుక్కల నియంత్రణ పై ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని సమర్థవంతం గా నిర్వహించుటకు మేయర్ తగు సూచనలు చేశారు.ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు నిబంధనలకు అనుగుణం గా నగరం లో జన సమూహ ప్రాంతాలైన పాఠశాలలు రైల్వే , బస్ స్టేషన్లు ,ఆసుపత్రులు పార్కులు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు సంచరించకుండా తగు చర్యలు చేపట్టాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అందుకు అనుగుణం గా అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా (ఏ డబ్ల్యూ బి ఐ)వారి సూచనలను పరిగణలోకి తీసుకొని బల్దియా వ్యాప్తం గా 66 డివిజన్ లలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ శానిటేషన్ విభాగాలు సమన్వయం తో పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ ఈ సత్యనారాయణ, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎం హెచ్ ఓ డా.రాజేష్ పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించండి



**వరంగల్ ఎంజీఎం, నవంబర్10(జనంసాక్షి):** గ్రీవెన్స్ (ప్రజావాణి) ఫిర్యాదులను వేగవంతం గా పరిష్కరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. మొత్తం గా 90 వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఎస్ ఈ సత్యనారాయణ,సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎం హెచ్ ఓ డా.రాజేష్ పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 15న బీసీ ఆక్రోశ సభ



**చిట్యాల, నవంబర్ 10(జనం సాక్షి) :** సోమవారం రోజున 42% బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల కేంద్రంలో నవంబర్ 15న జరిగే బీసీ ఆక్రోశ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతల రమేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల కోఆర్డినేటర్ శీలపాక నాగరాజు మాట్లాడుతూ బీసీ యువకులు విద్యావంతులు మేధావులు వివిధ ప్రజా సంఘాల నాయకులు పార్టీలకు అతీతంగా నవంబర్ 15న కామారెడ్డిలో జరగబోయే బీసీల ఆక్రోశ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు కానుగుల కొమురయ్య నాయి బ్రాహ్మణ సంఘం మండల నాయకులు మేడిపల్లి శ్రీనివాస్,మాదాసు దేవేందర్ పద్మశాలి సంఘం నాయకులు రమేష్ గౌడ,సంఘం నాయకులు ఉయ్యాల రమేష్, ముదిరాజ్ సంఘం నాయకులు గోల్కొండ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## గట్లనార్సింగాపూర్ విద్యార్థుల బహుమతుల ప్రభంజనం

**భీమదేవరపల్లి నవంబర్ 10(జనం సాక్షి) :** టీ-శాట్, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో సోమవారం భీమదేవరపల్లి మండలంలోని గట్లనార్సింగాపూర్ పాఠశాల విద్యార్థులు బహుమతుల ప్రభంజనం సృష్టించారు.ప్రశ్నోత్తర పోటీలో మెరుగు సంహిత ద్వితీయ బహుమతి వ్యాసరచన పోటీలో బొంతల సృజన తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డోలి రమేష్ విద్యార్థులను అభినందిస్తూ వారి కృషి ప్రతిభకు శుభాకాంక్షలు తెలిపారు. బహుమతులు అందుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి,శ్రీనివాస్,శ్రీనివాస్ రెడ్డి,అశోక్, విజయ్,ఉమా,స్రవంతి, సహన,స్వర్ణలత,కవిత,లక్ష్మణ్,నవీన్ కుమార్,మౌనిక,లలిత తదితర ఉపాధ్యాయులు,గ్రామస్థులు హృదయపూర్వకంగా అభినందించారు.



# డాక్టర్ అందెశ్రీ మరణం కళారంగానికి తీరని లోటు

**నర్సంపేట తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ నెల్లుట్ల సుమన్**

**నర్సంపేట నవంబర్ 10 ( జనం సాక్షి) :** నర్సంపేట పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించిన తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజావాగ్గేయకారుడు, అందెశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఘన నివాళి అర్పించారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నర్సంపేట తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ నెల్లుట్ల సుమన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయ హే తెలంగాణ గీత రచయిత, ప్రకృతి కవి లోక కవి ప్రజావాగ్గేయకారుని మరణం కళా రంగానికి తీరనిలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తాళ్ల సునీల్, యోచన, గాదెపాక బాబు, పదిదం రాజేందర్, బరిగేల రవీందర్, మేఘం, పవన్ భాస్కర్,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.







**అందెశ్రీ కి నివాళులు అర్పించిన యూనివర్సిటీ విద్యార్థులు**

**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 10 (జనం సాక్షి) :**తెలంగాణ గానాన్ని తన పాటలతో రచనలతో ప్రపంచవ్యాప్తంగా వినిపించిన గొప్ప కవి అందె శ్రీ అని ఎస్ఎఫ్ఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీ మొదటి గేటు ముందు విద్యార్థులతో కలిసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ జయ జయహే తెలంగాణ గీతం రచించిన అందె శ్రీ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. నేటితరం యువత విద్యార్థులు అందె శ్రీ యొక్క ఆలోచన విధానాలతో పోరాట స్ఫూర్తిని నింపుకొని ముందు నడవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్ పవన్ కుమార్ రణదీప్ విష్ణు దేగ రాజేష్ రాకేష్ శ్రీకాంత్ పీటర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**సంతాపం తెలిపిన ఉపాధ్యాయులు, విద్యార్థులు...**

**చెన్నారావుపేట, నవంబర్ 10(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత, ప్రముఖ కవి, పద్మశ్రీ అందెశ్రీ అకాల మరణం చెందడంతో ఘనంగా నివాళు లర్పించారు. మండలంలోని బోజేర్వు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించి సంతాపం తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్ర రవీందర్ అందెశ్రీ మృతి చెందడం కళారంగానికి తీరని లోటని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వర్, రమేష్, రాజు, శ్వేతశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

**అందెశ్రీ మరణం సాహితి రంగానికి తీరని లోటు : టియూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్**

**మల్హర్,నవంబర్10(జనంసాక్షి) :** అందెశ్రీ ఆకస్మిక మరణం తెలంగాణ రాష్ట్ర సాయితీ రంగానికి తీరని లోటని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం (టియూఎఫ్) భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్ అన్నారు. సోమవారం అందెశ్రీ మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసి నివాళు లర్పించారు. ?తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రూపశిల్పి, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి పూడ్చలేనిదని జన జాతరలో మన గీతం జయకేతనమై ఎగరాలి అంటు అందెశ్రీ తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని తన పాటలతో ఉద్భుతం చేసి రాష్ట్ర సాధనలో ఆయన పోషించిన పాత్ర మరువలేనిదని అన్నారు.

## నూతన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా పొందాలి

● **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ రూరల్, నవంబర్10(జనం సాక్షి) :** జిల్లాలోని ప్రజలు నూతన నిర్మాణాలకు సంబంధించి తప్పనిసరిగా అనుమతులు పొందాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.సోమవారం రాత్రి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్,గ్రామ పంచాయతీ,మున్సిపల్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయాశాఖల కు నిధులు,పన్నులు,తదితర రూపేనా సమకూరే నిధుల ఆదాయాన్ని పకడ్బందీగా వినియోగించు కోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వచ్చిన ప్రతి ఒక్క రూపాయిని,సమగ్రంగా ప్రజల సౌకర్యార్థం వినియోగించాలని తెలిపారు.వివిధ రూపాల్లో శాఖలకు వచ్చే ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని తెలిపారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో గోవింద్,డిపిఓ శ్రీనివాస్,నిర్మల్,ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ లు జగదీశ్వర్ గౌడ్,సుందర్ సింగ్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల 32 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**చెన్నారావుపేట, నవంబర్ 10 (జనం సాక్షి):** బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.2 లక్షల 32 వేల చెక్కులను కోనాపురం, చెన్నారావుపేట, ఖాదర్ పేట కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. కోనాపురం గ్రామానికి చెందిన అన్నెబోయిన కవిత సాంబయ్యకు రూ.1 లక్ష, చెన్నారావుపేట గ్రామానికి చెందిన కందిరాజిరెడ్డికి రూ.1 లక్ష 20 వేలు, ఖాదర్ పేట గ్రామానికి చెందిన చింతం సతీష్ కు రూ.12 వేల చెక్కులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయ్యాయి. ఆ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఆవుల రాములు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేష్ యాదవ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కల్లెపు రాజశేఖర్, గూడ మహేందర్, కంది నారాయణరెడ్డి, నరసింహా రాములు, కుందె కుమారస్వామి, మెంతుల రమేష్, చెవ్వ వెంకటేశ్వర్లు, పెంతల రాజు, ఉప్పుల దేవేందర్, కూస సాయి రెడ్డి, సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీఓగా జి.భవాని



**మహదేవపూర్, నవంబర్ 10 (జనంసాక్షి) :** మహదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం నూతన ఎంపీడీవో జి భవాని సోమవారం పదవి బాధ్య తలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవో గా పనిచేసిన ప్రసాద్ . గృహని ర్మాణ శాఖ కు కొత్తగూడెం బదిలీపై వెళ్లారు. పదవి బాధ్యతలు చేపట్టిన మహదేవపూర్ మండల పంచాయతీ అధికారిని జి భవానికి మండల పరిషత్ ఎంపీడీవో రవీంద్ర నాథ్ పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు.

## ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ

**నెక్కొండ, అక్టోబర్ 10 (జనం సాక్షి):** నెక్కొండ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు అశోక్ ఇల్లు భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, మాట్లాడుతూ వేద మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ నెరవేరుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదునూరి సాయి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, ఉపాధ్యక్షులు పోలిశెట్టి భాను ప్రకాష్, నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రావుల మహిపాల్ రెడ్డి, బొమ్మెర బోయిన రమేష్, మైనార్టీ మండల కాంగ్రెస్ నాయకులు ఎండీ అన్వర్, మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు రామారావు, వద్దే సంతోష్ లైసెట్టి వినయ్ పాల్గొన్నారు.

## పాపయ్య పేటలో సుద్దరేవుల ఆన కట్ట పరిశీలన

**రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే మరమ్మతులు**

**కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి...**



**చెన్నారావుపేట, నవంబర్ 10 (జనం సాక్షి):** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచనల మేరకు మండలంలోని పాపయ్యపేట గ్రామంలో ఉన్న సుద్దరేవుల ఆనకట్టను కాంగ్రెస్ వరంగల్ జిల్లా కార్యదర్శి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్ రెడ్డి సోమవారం పరిశీలించారు.

పాపయ్యపేట గ్రామ శివారులో ఉన్న సుద్దరేవుల ఆన కట్ట వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో రైతులు వెళ్లడానికి మోరీలను వేసి పైనుండి కంకర, మొరం పోసి మరమ్మత్తులు చేపట్టడం జరిగిందన్నారు.కాని గత నెల క్రితం కురిసిన భారీ వర్షానికి మోరీలపై ఉన్న కంకర, మొరం కొట్టుకు పోవడం జరిగిందన్నారు. దీంతో రైతులు రహదారి గుండా వెళ్లలేక ఇబ్బందులు పడకూడదని దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మరమ్మత్తు పనులు వేగవంతంగా చేపట్టడానికి సుద్దరేవుల ఆనకట్టను పరిశీలించినట్లు తెలిపారు. త్వరలోనే మరమ్మత్తుపనులను పూర్తి చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపయ్య పేట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ఉప్పరి కొమురయ్య, సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, మాజీ అధ్యక్షులు కంచ ప్రభాకర్, యూత్ నాయకులు వినోద్, అన్న కొమురయ్య, ధన్ సింగ్, రైతులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ గద్దె బాబు

**వరంగల్ ఈస్ట్, నవంబర్ 10 (జనం సాక్షి) :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ పరిధి బొల్లికుంటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధి బొల్లికుంటలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే ముందు మట్టి, రాళ్లు, చెత్త, తాలు లేకుండా ఆరబెట్టి తీసుకురావాలని, రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ ఏ రకానికి రూ. 2389 రూపాయలు, సాధారణ రకానికి 2369 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్య ప్రకాష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సొల్లి భూమాత రామస్వామి, మాజీ కార్పొరేటర్ పసునూరి స్వర్ణలత, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పసునూరి వేణుగోపాల్, డైరెక్టర్ షణ్ముఖ రెడ్డి, డివిజన్ నాయకులు, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా కలప అక్రమ రవాణా చేస్తే శాఖ పరమైన చర్యలు

● **నెక్కొండ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సరిత, నాగారం బీట్ ఆఫీసర్ యోగేష్...**

● **'జనం సాక్షి' కథనానికి స్పందన....**



చెన్నారావుపేట, నవంబర్ 10(జనం సాక్షి): గ్రామాలలో నుండి అనుమతులు లేకుండా కలపను అక్రమ రవాణా చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని నెక్కొండ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సరిత, నాగారం బీట్ ఆఫీసర్ సోమ యోగేష్ లు తెలిపారు. సోమవారం 'జనం సాక్షి' దినపత్రికలో పచ్చని చెట్లపై గొడ్డలివేటు... అని వచ్చిన కథనానికి వారు స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాలలో ఎలాంటి చెట్లను నరికినా కూడా ఆన్ లైన్ లో ఫారెస్ట్ అనుమతులు తీసుకోవాలన్నారు. టీజీ ఐఎఫ్ఎంఐఎస్ వెబ్ సైట్ ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్ లైన్ లో ఫారెస్ట్ అధికారుల అనుమతులు వచ్చాకనే ఎలాంటి చెట్లనైనా నరికి వేసుకోవాలని సూచించారు. ఆన్ లైన్ అనుమతి లేకుండా చెట్లను నరికి ట్రాక్టర్లు, డీసీఎం వాహనాలలో అక్రమంగా తరలించినట్లయితే వాహనాలను పట్టుకుని సీజ్ చేస్తామని తెలిపారు.